నేటి నుంచి యథావిధిగా ప్రజావాణి

నస్పూర్, జూన్ 9 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 10వ తేదీ నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు మంచిర్యాల జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సమస్యల పరిష్కారానికి అర్జీదారులు తమ దరఖాస్తులను అందజేయవచ్చని పేర్కొన్నారు.

నేటి నుంచి నక్కలపల్లిలో మారమ్మ జాతర

గోదావరి నది వద్ద అమ్మవార్లకు పూజలు చేస్తున్న భక్తులు

కోటపల్లి, జూన్ 9 : కోటపల్లి మండలం నక్కలపల్లి గ్రామంలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు మారమ్మ జాతర నిర్వహించనున్నట్లు ఆలయ పూజారులు తెలిపారు. జాతరను పురస్కరించుకొని అమ్మవార్లను దర్శించుకునేందుకు ఆదివారం చెన్నూర్ గోదావరికి భక్తులు తరలించి అభిషేకాలు చేశారు. సోమవారం ఆలయంలో అమ్మవార్ల అలంకరణ, బోనాల సమర్పణ, మంగళవారం అమ్మవార్ల రథయాత్ర ఉంటుందని వివరించారు. జాతర సందర్భంగా గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరుతున్నారు.

ఘనంగా ఎస్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం

నస్పూర్, జూన్ 9 : మంచిర్యాలలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జెండాను ఎగురవేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోకల వెంకటేశ్వర్లు, శంకర్‌గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా చేపట్టాలని, పెండింగ్ బిల్లులు, డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పాత పింఛన్ పునరుద్ధరించాలన్నారు. అనంతరం రిటైర్డు ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో భీంరావు, వెంకటేశ్వర్లు, మల్లేశ్, సుమన్, చారి, శ్రీనివాస్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్ ఆలయంలో పూజలు

పూజలు చేస్తున్న భక్తులు

రెబ్బెన, జూన్ 9 : రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామంలో కొలువుదీరిన శ్రీ కనకదుర్గాదేవి స్వయం భూ మహాంకాళి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు దేవర వినోద్ తీర్థ ప్రసాదాలు అందించి అన్నదానం ఏర్పాటు చేశారు.

నిత్యావసర సరుకులు అందజేత

నిత్యావసర సరుకులు అందజేస్తున్న డాక్టర్ గోలి శృతి కృష్ణ దంపతులు

మంచిర్యాల ఏసీసీ, మే 9: మంచిర్యాలలోని శ్రీశ్రీ నగర్‌లో గల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆనంద నిలయం అనాథ పిల్లల, వయోవృద్ధుల ఆశ్రమంలో పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది గోలి కృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని డాక్టర్ గోలి శృతి కృష్ణ దంపతులు ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్ పాల్గొన్నారు.

దండేపల్లిలో సంబురాలు

నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

దండేపల్లి, జూన్ 9 : కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం, మూడోసారి మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో పార్టీ శ్రేణులు దండేపల్లిలో ఆదివారం సంబురాలు చేసుకున్నారు. పటాకులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు గోపతి రాజయ్య, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత

వీల్‌చైర్ అందజేస్తున్న నాయకులు వేముల కృష్ణ

కాసిపేట, జూన్ 9 : కాసిపేట మండలం దుబ్బగూడెం గ్రామానికి చెందిన ఓరం కార్తీక్ కొన్నేళ్ల కిందట చోటు చేసుకున్న ప్రమాదంలో గాయపడగా అప్పటి నుంచి నడవలేని స్థితిలో ఉన్నాడు. ఈ విషయాన్ని రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్‌కు తెలియడంతో వెంటనే స్పందించి చేయూత అందించారు. నూతన వీలుచైర్‌ను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు, మంచిర్యాల నియోజకవర్గ కోఆర్డినేటర్ వేముల కృష్ణ, చారిటబుల్ సభ్యుడు సత్తార్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కనుకుల రాకేశ్, కాసిపేట గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మధు పాల్గొన్నారు.

జేఈ అడ్వాన్స్‌లో జన్నారం విద్యార్థి ప్రతిభ

విజయ్ రాజ్

జన్నారం, జూన్ 9 : జన్నారం మండలం పొనకల్ గ్రామానికి చెందిన బీ విజయ్ రాజ్ అనే విద్యార్థి జేఈ అడ్వాన్స్‌లో ఆలిండియా స్థాయిలో 210వ ర్యాంకు సాధించాడు. విజయ్ తండ్రి పొనకల్ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం రాజూ నాయక్. పది వరకు జన్నారంలో చదివి, ఇంటర్మీడియట్ హైదరాబాద్ నారాయణ జూనియర్ కళాశాలలో చదివాడు.

ప్రశాంతంగా గ్రూపు-1 ప్రిలిమినరీ

- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన డీసీపీ, ఏసీపీ

హాజీపూర్ : పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న డీసీపీ, ఏసీపీ, ఎస్ఐ

హాజీపూర్, జూన్ 9 : మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని ఎస్ఆర్ఆర్, ఎస్ఆర్ కేఎం కళాశాలల్లో ఆదివారం నిర్వహించిన గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9:30 గంటల నుంచి బయోమెట్రిక్ హాజరు తీసుకొని 10 గంటలకు కళాశాల ప్రధాన గేట్లను మూసి వేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో పాటు ప్రథమ చికిత్స కిట్లను ఏర్పాటు చేసి వైద్య, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. తాగునీరు, విద్యుత్ సరఫరా సమస్యలు ఎదురుకాకుండా చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాలను మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, ఏసీపీ ప్రకాశ్‌తో పాటు హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ పరిశీలించి బందోబస్తును నిర్వహించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను అమలు పర్చారు. ఎస్ఆర్ఆర్ కళాశాలలో 312 మంది అభ్యర్థులకు గాను 239 మంది హాజరుకాగా 73 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఎస్ఆర్‌కేఎం కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 240 మంది అభ్యర్థులకు గాను 188 మంది హాజరుకాగా 52 మంది గైర్హాజరయ్యారు. రెండు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన ముగ్గురు అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించలేదు.

కాగజ్‌నగర్: పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్, జూన్ 9: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో నిర్వహించిన గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఆయా విద్యాలయాల్లో ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఇందులో భాగంగా మొత్తం 1512 మంది అభ్యర్థులకు గాను 1239 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ పర్యవేక్షించారు. వారి వెంట పట్టణ సీఐ శంకరయ్య, కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్ఐలు మహేందర్ ఉన్నారు.

యథేచ్ఛగా ఇసుక రవాణా

- పట్టించుకోని అధికారులు

జైనూర్‌లో పట్టపగలు ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్

జైనూర్ జూన్ 9 : జైనూర్ ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నది. లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు పెద్దఎత్తున తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్న రెవెన్యూ, పోలీసు అధికారులు కన్నెత్తి చూడడం లేదు. నిబంధనలు ఉల్లంఘిస్తూ వాగులు వంకలను అడ్డగా చేసుకొని తవ్వకాలు చేస్తున్నారు. ఆసిఫాబాద్, కెరమెరి ప్రాంతాల్లో ఎక్కువగా క్వారీలు నడుపుతూ మండలంలోని తదితర గ్రామాలతో పాటు జైనూర్‌కు ట్రాక్టర్ ఇసుక రూ.7వేల వరకు విక్రయిస్తున్నారు. ఆయా ప్రాంతాల దళారులు ఇసుక అక్రమ రవాణా ద్వారా ఇప్పటికే లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకొని అధికారులకు మామూలు ముట్టజెప్పడంతో ఆడిందే ఆట పాడింది పాటగా కొనసాగుతుంది. వాగుల్లో ఇసుక అక్రమ రవాణా వల్ల భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. యంత్రాలను ఏర్పాటు చేసి విచ్చలవిడిగా ఇసుకను తోడేస్తుండడంతో భూగర్భజలమట్టం గణనీయంగా పడిపోతుంది. గతంలో వాగుల్లో నీటి జలాలు పుష్కలంగా ఉండగా ప్రస్తుతం జాడ కనిపించడం లేదు.

కన్నెత్తి చూడని అధికారులు

ఇసుక దళారులు రెచ్చిపోతున్న ఇటు రెవెన్యూ అటు పోలీసు అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఉన్నతాధికారులకు అజ్ఞాత వ్యక్తులకు సమాచారం అందించే సమయంలో మాత్రం హడావుడి చేసి తర్వాత అక్కడ ఏమి జరగలేదు అన్నట్టు మిన్నకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

చెన్నూర్: ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1992-93 పదో తరగతి విద్యార్థులు

రామకృష్ణాపూర్: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న గురువులతో పూర్వ విద్యార్థులు

చెన్నూర్, జూన్ 9 : చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992-93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పట్టణంలోని సంతోషిమాత ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒక్కొక్కరు ఒక్కో చోట విభిన్న రంగాల్లో స్థిరపడిన వారంతా దాదాపు 30 సంవత్సరాల తర్వాత ఆత్మీయ సమ్మేళనం ద్వారా ఒక చోట కలుసుకున్నారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. ఆటాపాటలతో సరదాగా గడిపారు. అప్పటి గురువులను సన్మానించారు.

రామకృష్ణాపూర్, జూన్ 9: రామకృష్ణాపూర్ జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో 1990-91 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులందరూ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు చేరుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా 'ఏ' జోన్, సూపర్ బజార్ మీదుగా డీజే సౌండ్స్ మధ్య నృత్యాలు చేసుకుంటూ సింగరేణి ఆర్‌కేసీవోఏ క్లబ్‌కు చేరుకున్నారు. క్లబ్‌లో అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం పాఠశాలలో చదువుకున్న చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

కాగజ్‌నగర్, జూన్ 9 : కాగజ్‌నగర్‌లోని బాల భారతి విద్యాలయానికి చెందిన 1994-95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం రాయల్ గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు ఎమ్మాజీ సతీశ్; బాలు, సదానందం, అనిల్, ప్రతాప్, రమేశ్, ఖాలీల్, సుజాత, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

గనుల్లో ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలి

- సేఫ్టీ ట్రైపార్టియేట్ మీటింగ్‌లు నిర్వహించాలి
- హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్

మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్, జూన్ 9: సింగరేణి యాజమాన్యం గనుల్లో ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ కోరారు. వెంటనే సేఫ్టీ ట్రైపార్టియేట్ సమావేశాలు నిర్వహించి కార్మిక సంఘాల సలహాలు, సూచనలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో రోజురోజుకూ ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నా యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తున్నదని ఆరోపించారు. గుర్తింపు ఎన్నికలు జరిగి ఆరు నెలలు దాటినా యూనియన్లకు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల హోదా పత్రాలు ఇవ్వలేదన్నారు. వెంటనే గుర్తింపు పత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీకి గుర్తింపు పత్రం ఇవ్వకుండానే అధికారం చెలాయిస్తున్నదని, ఐఎన్‌టీయూసీ ప్రభుత్వం అండతో గుర్తింపు సంఘానికి సమాంతర పాలన సాగిస్తున్నదని విమర్శించారు. ఈ రెండు సంఘాలు కూడబలుక్కొని యాజమాన్యం నిర్ణయాలకు మద్దతు ఇస్తున్నాయని ఆరోపించారు. ఏఐటీయూసీ సంస్థ వ్యాప్తంగా ఆర్థిక లక్ష్యాలు పెట్టుకొని మరి పైరవీలు చేస్తుందన్నారు. నెలకు రూ. 10 లక్షల నుంచి 20 లక్షల లక్ష్యంతో అవినీతికి పాల్పడుతున్నదని ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న విజిలెన్స్ డిపార్ట్‌మెంటులోని అధికారులను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో గనుల ప్రైవేటీకరణకు అన్ని కార్మిక సంఘాలు సమ్మె చేసి వ్యతిరేకించాయని, సింగరేణి కూడా కేంద్రానికి సంస్థకే గనులను అప్పగించాలని కోరుతూ లేఖలు రాసిందన్నారు. అధికారులు సమ్మెలో పాల్గొని గనుల ప్రైవేటీకరణను వ్యతిరేకించారని చెప్పారు. ఇప్పుడు సింగరేణి యాజమాన్యం ప్రైవేట్ బహుళజాతి సంస్థలతో కలిసి గనుల వేలంలో పాల్గొని తీసుకోవడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నాదని ఆరోపించారు. వెంటనే ఆనిర్ణయం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణికే గనులను అప్పగించాలని కోరారు. కార్మికుల పేర్లలో దొర్లిన తప్పులను అఫ్‌డెవిట్ ద్వారా సవరించాలన్నారు. కార్మికుల పిల్లల ఉద్యోగ వయోపరిమితిని ప్రభుత్వ సంస్థల్లో 45 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హెచ్ఎంఎస్ అధ్యక్షుడు జక్కుల నారాయణ, ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి, కేంద్ర కార్యదర్శి గొళ్ల సత్యనారాయణ, ఆర్గనైజర్ దుర్గం లక్ష్మణ్, ఎస్‌టీపీపీ కార్యదర్శి ప్రదీప్‌రెడ్డి, సాయికృష్ణ, ఫిట్ కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, నామాల శ్రీనివాస్, పల్లె క్రాంతి, చెవుల శ్రీనివాస్, నర్సయ్య, దాసరి శ్రీనివాస్, శివాజీ, సందీప్, సత్యబాబు, బాలయ్య, రాజేశం, సొదారి మల్లిక, విక్రమ్, సంపత్‌కుమార్, వంశీ, శ్రీరామ్, రాము, రాజు, వెంకటస్వామి పాల్గొన్నారు.

శివాజీ మహారాజ్ గొప్ప రాజనీతిజ్ఞుడు

శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

దహెగాం, జూన్ 9 : శివాజీ మహారాజ్ గొప్ప రాజనీతిజ్ఞుడు అని కుమ్రం భీం ఆసిఫాబాద్ జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. దహెగాం మండలం చిన్నరాస్పల్లి గ్రామంలో ఆరెకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ముందుగా బ్యాండ్ మేళాలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ శివాజీ మహారాజ్ గొప్ప చరిత్రకారుడని కొనియాడారు. ఆరె కులస్తులు ఐక్యతతో విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం హర్షణీయమన్నారు. ఆరె కులస్తుల సమస్యలు తీర్చేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అదే విధంగా మండల కేంద్రంలో సంఘం భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీలు కంబగౌని సులోచన, నానాయ్య, వైస్ ఎంపీపీ చౌదరి సురేశ్, ఎంపీటీసీ గౌరె రాకేశ్, ఆరె సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు తుమ్మిడ నారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు చప్పిడ అంజన్న, సంఘం నాయకులు సత్యనారాయణ, వానుపటేల్, రాందాస్, డోకె దామోదర్, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావు మృతి పట్ల నివాళి

కాసిపేట: నివాళులర్పిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

కాసిపేట, జూన్ 9 : కాసిపేటలోని ప్రెస్ క్లబ్ భవనంలో సభ్యులు రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నజీర్ హుస్సేన్, సభ్యులు రవి రాజ్, మోతీరాం పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, జూన్ 9: కాగజ్‌నగర్‌లోని బాలభారతి విద్యాలయం ఆవరణలో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రామోజీరావు మృతికి సంతాపం తెలిపి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అంతకు ముందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు టీ సురేందర్ రావు, ప్రధానకార్యదర్శి తిరుమల చారి, కోశాధికారి షఫీ ఉల్లా, సభ్యులు మధుకర్, గంధం శ్రీనివాస్, తిరుపతి, సంతోష్, అనిల్, రాజు, వార్ల మహేశ్, ఎండీ ఇసాక్, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: నివాళులర్పిస్తున్న ప్రెస్ క్లబ్ సభ్యులు

సింగరేణి స్కూల్ ఫస్ట్‌బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం

తాండూర్, జూన్ 9 : మాదారం టౌన్‌షిప్‌లోని లాల్ బహదూర్ క్రీడా మైదానంలో మాదారం సింగరేణి స్కూల్ ఫస్ట్‌బ్యాచ్ విద్యార్థులు క్రికెట్ క్లబ్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మాదారం ఎంపీటీసీ సూరం రవీందర్ రెడ్డి హాజరై మొదటగా సీనియర్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి భూగర్భగనులు నడుస్తున్న తరుణంలో కార్మికుల సందడితో మాదారం టౌన్ షిప్ కళకళలాడుతూ ఉండేదన్నారు. అప్పటి యువత విద్యార్థి దశ నుంచే ఆటల్లో సత్తాచాటి ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చారని ప్రశంసించారు.

క్రీడాకారులతో ఎంపీటీసీ సూరం రవీందర్‌రెడ్డి

మడుగులో పడి ఒకరి మృతి

రెబ్బెన, జూన్ 9 : రెబ్బెన మండలం గోలేటి గ్రామ శివారులోని వాగులో గల మడుగులో నంబాల గ్రామానికి చెందిన టేకాం శంకర్(55) ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..నంబాల గ్రామానికి చెందిన టేకాం శంకర్ నాలుగు సంవత్సరాల నుంచి నాందేవ్ అనే వ్యక్తి దగ్గర పాలేరుగా పని చేస్తున్నాడు. దుగ్గపూర్ గ్రామంలోనే ఉంటు ఆవులు, ఎద్దులు మెపుతుండే శంకర్ రోజు వారి పనుల్లో భాగంగా ఆదివారం ఆవులు, ఎద్దులు తీసుకొని మేత కోసం వాగు సమీపంలోకి వెళ్లాడు. వాగులో గల మడుగు వద్ద ఆవులు, ఎద్దులు మేపుతుండగా ప్రమాదవశాత్తు అందులో పడిపోగా దుగ్గపూర్ గ్రామానికి చెందిన పలువురు గమనించి నాందేవ్‌కు సమచారం అందించారు. నాందేవ్ అక్కడికి చేరుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. శంకర్‌ను 108 అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యులు వైద్య పరీక్షలు చేయగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. టేకాం శంకర్ కుమారుడు టేకాం విలాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికుడి మృతి

ఏముర్ల రాజయ్య(ఫైల్)

రామకృష్ణాపూర్, జూన్ 9: క్యాతనపల్లి మున్సిపాలిటీలో పారిశుధ్య విభాగంలో పని చేసే ఔట్‌సోర్సింగ్ కార్మికుడు ఏముర్ల రాజయ్య (56) మృతి చెందడం ఆదివారం ఆలస్యంగా వెలుగు చూసింది. మున్సిపాలిటీలోని 5వ వార్డు అమరవాదికి చెందిన రాజయ్య కొన్నేళ్లుగా మున్సిపాలిటీలో పారిశుధ్య విభాగంలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం యథావిధిగా విధులకు హాజరయ్యాడు. అమ్మా గార్డెన్ ఏరియాలో విధులు నిర్వహిస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. దీంతో తోటి కార్మికులు రాజయ్యను మున్సిపాలిటీ వాహనంలో అమరవాదిలోని తన ఇంటిలో దింపినారు. తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో 108 అంబులెన్స్ ద్వారా కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

ఆర్థిక సాయం

రాజయ్య మృతి పట్ల పట్టణ కాంగ్రెస్ నాయకులు సంతాపం వ్యక్తం చేసి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, గోపతి రాజయ్య, గాండ్ల సమ్మయ్య ఉన్నారు.